
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్

జిల్లాల వార్తలు

బుధవారం 12 నవంబరు 2025

క్రికెట్ బెట్టింగ్‌లో నష్టాలు..
యువకుడి ఆత్మహత్య 7

అంగన్‌వాడీ కేంద్రాలకు
కుళ్లిన కోడిగుడ్లు సరఫరా



నారాయణఖేడ్‌లో శనగకూర అమ్ముతున్న మహిళ

శనగకూర @ రూ.300

నారాయణఖేడ్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శీతాకాలంలో మాత్రమే లభించే శనగకూరకు మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉంది. నారాయణఖేడ్‌లో మంగళవారం సంతలో శనగకూర కిలో రూ.300 పలికింది. ధర ఎక్కువైనా ఎగబడి కొనుగోలు చేశారు. నల్లరేగడి భూముల్లో మంచుపై ఆధారపడి శనగ పంట పండుతుంది. శనగ పంటను సాగు చేసిన రైతులు పంట పూతకు రాకముందే లేత ఆకులు, రెమ్మలను తెంపి కూరగా ఉపయోగిస్తారు. దీనివల్ల మొక్క ఎక్కువ కొమ్మలువేసి విస్తరిస్తుంది. శుభకార్యాలు, పూజల్లో నైవేద్యాలకు శనగకూరను ప్రత్యేకంగా వండుతారు. గతంలో శనగ పంట విస్తారంగా సాగు చేసేవారు. రైతులు శనగ కూరను ఉచితంగా తెంపుకోనిచ్చేవారు. శనగ సాగు తగ్గడంతో రైతులే కూలీలతో శనగకూర ఆకులు తీయించి విక్రయిస్తున్నారు. లభ్యత తగ్గడంతో ధర విపరీతంగా పెరిగినా ఆసక్తి మాత్రం తగ్గలేదు.



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డి జైలు మ్యూజియంను
పరిశీలించిన జైళ్లశాఖ డీఐజీ

సంగారెడ్డి అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని హెరిటేజ్ జైలు మ్యూజియంను జైళ్లశాఖ డీఐజీ శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. జైలు మ్యూజియం దుస్థితిపై 'పట్టింపులేక పడావు' శీర్షికతో ఈ నెల 10న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో, ఆయన జైలు మ్యూజియం భవనాలను తనిఖీ చేశారు. ఈ ప్రాంగణం వెనుకవైపు జైలుకు సంబంధించిన స్థలంలోనే ఓ ప్రైవేటు వ్యక్తి చేపడుతున్న నిర్మాణాన్ని పరిశీలించారు. ఆయనవెంట ఇన్‌చార్జి డీఎస్‌జేవో భరత్‌రెడ్డి, జైలు అధికారులు ఉన్నారు.

కట్టడి ఏదీ?



ఉమ్మడి జిల్లాలో విజృంభిస్తున్న కుక్కలు

పది నెలల్లో 5,500 మందిపై దాడి

సుప్రీంకోర్టు హెచ్చరించినా కదలిక కరువు

వీధి కుక్కల గణనతోనే సరిపెట్టిన అధికారులు

కానరాని బర్త్‌కంట్రోల్ చర్యలు

జిల్లా	కుక్కల సంఖ్య	2025లో కుక్కకాట్లు
సిద్దిపేట	47,568	1,730
సంగారెడ్డి	62,775	1,962
మెదక్	25,000	2020

జనసంచార ప్రాంతాల్లో కుక్కల విహారాన్ని నియంత్రించాలని ఇటీవల దేశ అత్యున్నత న్యాయస్థానం సూచనలు చేసింది. దీంతో అందరి దృష్టి కుక్కలపైకి మళ్లింది. కుక్కలను స్వేచ్ఛగా వదిలేయడంతో మనుషులను గాయపరుస్తున్న సంఘటనలు వెలుగుచూస్తున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో కుక్కల కారణంగా ప్రాణాలు కోల్పోయిన పరిస్థితి కూడా ఉంది. కుక్కకాటుకు గాయపడుతున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. గతంలో కుక్కల సంఖ్యను లెక్కించినప్పటికీ తాజాగా సుప్రీంకోర్టు ఆదేశాలతో మరోసారి అధికార యంత్రాంగం దృష్టి సారించినట్లుగా తెలుస్తోంది.

సంగారెడ్డి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి మెదక్ జిల్లాలో కుక్కల దాడి సంఘటన లేని రోజు లేదంటే అతిశయోక్తి కాదు. ప్రతీరోజు ఏదో ఒకచోట ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. వీధికుక్కల నియంత్రించడానికి యానిమల్ బర్త్ కంట్రోల్ ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ పూర్తిస్థాయి ఆచరణ సాధ్యం కావడం లేదు. కుక్కల కారణంగా మనుషులు చనిపోవడం, గాయాలపాలైన సంఘటనలు గతంలో అనేకం ఉన్నాయి. అలాగే, పలుచోట్ల కుక్కలను చంపడం వల్ల బాధ్యులపై కేసులూ నమోదయ్యాయి. దీంతో కుక్కల జోలికి వెళ్లాలంటేనే అధికారులు, స్థానికులు జంకుతున్నారు. దీంతో కుక్కల జనన నియంత్రణ ఒక్కటే ఆధారమైంది. కుక్కల సంఖ్య విపరీతంగా ఉండడంతో ఈ ప్రక్రియ ఆచరణలో సాధ్యం కావడంలేదు. వీధికుక్కల సమస్యపై ఇటీవల సుప్రీంకోర్టు పలు సూచనలు చేసింది. జనసంచార ప్రాంతాల్లో కుక్కల జనన నియంత్రణ చేపట్టాలని హెచ్చరించింది. ఈక్రమంలో జిల్లాల్లో అధికారులు మరోసారి దీనిపై దృష్టిపెట్టారు.

లెక్కలతోనే సరి

ఏడాది క్రితం కుక్కకాట్లను అరికట్టడానికి అధికారులంతా ఉమ్మడి మెదక్ జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో సర్వే చేశారు. యానిమల్ బర్త్‌కంట్రోల్ సెంటర్లలో జనన నియంత్రణ ఆపరేషన్లు చేయించాలని నిర్ణయించారు. హడావిడిగా కుక్కలను లెక్కించినా జనన నియంత్రణపై చేతులెత్తేశారు. లెక్కలతోనే సరిపెట్టారే తప్ప ఒక్క అడుగు కూడా మిగతా 7వ పేజీలో





వామ్మో కోతులు.. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటేనే భయం

పాపన్నపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వామ్మో ఇన్ని కోతులా..! రోడ్డుపై ప్రయాణించాలంటేనే భయమేస్తుందని బాటసారులు బెదిరిపోతున్నారు. పాపన్నపేట మండలం కొత్తపల్లి వద్ద మెదక్, బొడ్మట్పల్లి రహదారిపై మంగళవారం ఎక్కడి నుంచి వచ్చాయో వందకు పైగా కోతులు రోడ్డుపై తిష్టవేశాయి. ఈ రహదారిపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. రహదారికి ఇరువైపులా పంట పొలాల్లో కల్లాల వద్దకు వచ్చే రైతులు, మహిళలు కోతులను చూసి భయపడుతున్నాయి. ఎవరైనా ధైర్యం చేసి ముందుకు పోదామనుకున్నా వాహనదారులపై దాడిచేసి గాయపర్చేందుకు వెనుకాడలేదు. దీంతో గ్రామస్థులు, ప్రయాణికులు బెదిరిపోయారు. రోజూ ఇదే తంతు నడుస్తున్నదని, కోతులను తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ మంగళవారం ఆయన ఓ ప్రకటనలో కక్షిదారులను కోరారు. ఈ నెల 15న ప్రత్యేక జాతీయ లోక్‌అదాలత్ జరుగుతుందని ఆయన తెలిపారు. క్షణికావేశంలో చేసిన తప్పులను సరిదిద్దుకోవడానికి లోక్ అదాలత్ మంచి అవకాశమని అన్నారు. అనవసర గొడవలకు పోయి జీవితాలను ఇబ్బందిపాలు చేసుకోకూడదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న, రాజీ కుదుర్చుకోవడానికి అవకాశమున్న కేసుల్లో కక్షిదారులు రాజీపడేలా లోక్‌అదాలత్ దోహదపడుతుందని తెలిపారు. క్రిమినల్ కంపౌండబుల్, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబపరమైన, వైవాహిక జీవితానికి సంబంధించిన, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్‌బౌన్స్ తదితర కేసుల్లో ఇరువర్గాల సమ్మతితో రాజీ కుదుర్చుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. సైబర్ నేరాలకు సంబంధించి బాధితులు కోల్పోయిన డబ్బులు త్వరగా బాధితులకు అందేవిధంగా చూడాలని పోలీసులకు సూచించారు. రూ. 25వేల కంటే తక్కువ డబ్బు కోల్పోయిన కేసుల్లో లోక్ అదాలత్ ద్వారా ఫిర్యాదు చేసుకొని ఎఫ్ఐఆర్ లేకుండానే రీఫండ్ ప్రక్రియ చేసుకోవచ్చని పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్ విజయవంతం అయ్యేలా అధికారుల నుంచి కానిస్టేబుల్ వరకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. రాజీ పడదగిన అన్ని కేసులలో ఇరువర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీపడేలా చూడాలన్నారు.

ఎంఆర్‌సీ, సీఆర్‌సీల నిర్వహణకు
నిధుల మంజూరు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో పాఠశాల విద్యాశాఖకు సంబంధించి మండల వనరుల కేంద్రం(ఎంఆర్‌సీ), కాంప్లెక్స్ రిసోర్స్ సెంటర్(సీఆర్‌సీ)ల నిర్వహణ నిధులు 50 శాతం విడుదలయ్యాయి. జిల్లాలో 29 ఎంఆర్‌సీలు ఉండగా ఒక్కోదానికి రూ.90 వేల చొప్పున రూ.13,05,000 నిధులు విడుదలయ్యాయి. 85 సీఆర్‌సీలకు ఒక్కోదానికి రూ.33 వేల చొప్పున రూ.14,02,500 మంజూరయ్యాయి. ఆయా నిధులను ఎంఆర్‌సీ, సీఆర్‌సీ ఖాతాల్లో జమ చేయనున్నట్టు అధికారులు తెలిపారు.



మార్కండేయ ఆలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తీక శోభ

నారాయణఖేడ్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భక్తమార్కండేయ ఆలయ ఆవరణలో కార్తీక దీపోత్సవం, శివ పార్వతుల కల్యాణం, తులసీదామోదర కల్యాణం, లక్ష పుష్పార్చన మంగళవారం వైభవంగా నిర్వహించారు. మహిళలు దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. జ్వాలాతోరణాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో తిలకించారు. బాలికల పేరణి శివ తాండవం, భరతనాట్యం ఆకట్టుకున్నాయి. అంతర్గాం, కొండాపూర్ పీఠాధిపతులు కరణ్‌గజేంద్ర భారతి మహారాజ్, సంగ్రాం మహారాజ్, పురోహితులు, ఆలయ కమిటీ పాల్గొన్నారు.



వెల్దుర్తిలో గుంతలమయంగా మారిన రోడ్డు

గుంతలు..
గతుకులు

ఉమ్మడి జిల్లాలో అధ్వానంగా రోడ్లు

అడుగడుగునా గుంతలే..

వర్షాలకు కోతకు గురైన సైడ్‌బర్మ్‌లు

మరమ్మతుకు నోచుకోని వైనం

ప్రమాదాలు నిత్యకృత్యం

భయం భయంగా వాహనదారుల ప్రయాణం

7

బ్లడ్ శాంపిళ్ల రవాణాకు బ్రేక్!

బిల్లులు రావడంలేదని వాహనాలు పంపని కాంట్రాక్టర్

ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో నిలిచిన రక్త పరీక్షలు

ప్రత్యామ్యాయ ఏర్పాట్లు చేయని వైద్య ఆరోగ్యశాఖ



సంగారెడ్డిలోని టీ-డయాగ్నోస్టిక్ హబ్

సంగారెడ్డి అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం రోగుల రోగ నిర్ధారణ పరీక్షలకు బ్రేక్ పడింది. ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల నుంచి రక్తం నమూనాలను సేకరించి సంగారెడ్డిలోని టీ-డయాగ్నోస్టిక్ హబ్‌కు ప్రత్యేక వాహనాల్లో తరలిస్తారు. ఇందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ టెండర్ ప్రాతిపదికన తొమ్మిది వాహనాలతో ఒప్పందం చేసుకున్నది. నాలుగైదు నెలలుగా ప్రభుత్వం నుంచి డబ్బులు రాకపోవడంతో కాంట్రాక్టర్ వాహనాలను కేంద్రాలకు పంపలేదు. వాహనం వస్తుందని నిర్ధారించుకున్నాకే రోగుల నుంచి శాంపిళ్లు సేకరించాలని టీ-హబ్ వాట్సాప్ గ్రూపులో నిర్వాహకుడు మంగళవారం ఉదయమే పోస్టు చేశారు. దీంతో, ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో రోగుల నుంచి బ్లడ్ శాంపిళ్లు సేకరించలేదు. కొన్ని ఆస్పత్రుల నుంచి స్వయంగా టీ-హబ్‌కు వచ్చి సేకరించిన శాంపిళ్లు అందజేశారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కరువు

జిల్లా వ్యాప్తంగా రక్త నమూనాల తరలింపు వాహనాలు నిలిపేస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు ముందే సమాచారం ఉందా? లేదా? ఒక వేళ సమాచారముంటే రక్త నమూనాల తరలింపునకు వైద్య శాఖ ఎందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేకపోయిందనే ప్రశ్నలు ఉత్పన్నమౌతున్నాయి. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండానే ఆకస్మాత్తుగా వాహనాలు నిలిపివేయడంతో జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.


రోగులను ఇబ్బందులు పెడతారా?

ప్రభుత్వం బిల్లులు విడుదల చేయకపోతే తమను ఎలా ఇబ్బందులు పెడతారని రోగులు ప్రశ్నిస్తున్నారు. సర్కారు తప్పిదం.. రోగులకు నిజంగా శాపంగానే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్కారు బిల్లులు ఎక్కడికి పోతాయని, ఆలస్యగానైనా వస్తాయి కదా, అలాంటి కారణాలు చూపి రోగులను ఇబ్బందులకు గురిచేయడం ఎంత వరకు సమంజసమని రోగులు వాపోయారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు సీరియస్‌గా స్పందించే అవకాశముందని వైద్యశాఖ వర్గాలు పేర్కొన్నాయి.

ముందస్తు గా సమాచారం ఇవ్వలేదు

రక్త నమూనాల రవాణా వాహనాలు నిలిపివేస్తున్నట్టు కాంట్రాక్టర్ ముందస్తుగా సమాచారం ఇవ్వలేదు. ఆకస్మాత్తుగా మంగళవారం ఉదయం వాట్సాప్‌గ్రూప్‌లో మెసేజ్ చేసినట్లు మా దృష్టికి వచ్చింది. దీంతో రోగులు ఇబ్బందులు పడిన మాట వాస్తవమే. పెండింగ్ బిల్లుల విషయం ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లాం. వారం రోజుల్లో క్లియర్ చేస్తామని సమాచారం ఇచ్చారు.

-నాగనిర్మల, డీఎంహెచ్‌వో, సంగారెడ్డి జిల్లా



పుల్కల్ కొనుగోలు కేంద్రంలో వడ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

కొనుగోళ్లు వేగవంతం చేయండి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

పుల్‌కల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పత్తి, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సంగారెడ్డి కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. పుల్కల్ మండలంలో మంగళవారం కలెక్టర్ పర్యటించారు. గొంగ్లూరులో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించారు. దశలవారీగా లబ్దిదారుల ఖాతాలో బిల్లులు జమ చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం పుల్కల్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఇప్పటివరకు సేకరించిన ధాన్యం వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తూకం వేసిన ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిల్వ ఉంచవద్దని వెంట వెంటనే తరలించాలన్నారు. అనంతరం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు నూతన పత్తి కొనుగోలు విధానంపై అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖ అధికారులు, మార్కెటింగ్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రైతులు కిసాన్ కపాస్ యాప్ స్లాట్ బుక్ చేసుకొని అందులో సూచించిన విధంగా, నిర్ణీత సమయానికి సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకురావాలన్నారు. సింగూరు గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షలంటే భయాన్ని తొలగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ ప్రావీణ్య హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట ఆర్డీవో పాండు, తహసీల్దార్ కృష్ణ, డీసీసీబీ డైరెక్టర్ రాంసాని రామచంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ ఆగమయ్య తదితరులు ఉన్నారు.

అవుసుల కుంటకు ఎసరు

కట్టను తవ్వేసినా పట్టించుకోని మున్సిపల్, ఇరిగేషన్, హెచ్ఎండీఏ అధికారులు

తూప్రాన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలో కుంటలు కాలగర్భంలో కలసిపోతున్నాయి. తూప్రాన్ మండలం 2006 నుంచి హెచ్ఎండీఏ పరిధిలోని వచ్చింది. అప్పటి నుంచి అనేక కుంటలు అన్యాక్రాంతమైనా హెచ్ఎండీఏ అధికారుల చర్యలు తీసుకున్న దాఖలాలు లేదు. తాజాగా రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి వెళ్లే రహదారి పక్కనే ఉన్న అవుసులోల్ల కుంటకు అక్రమార్కులు ఎసరు పెట్టారు. కట్టను తవ్వేసి ఆ స్థలాన్ని ఆక్రమిస్తున్నారు. మట్టిని విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు. రెండు రోజులుగా రాత్రుల్లో యదేచ్ఛగా కుంట కట్టను తొలగిస్తున్నారు. కట్టను కరిగిస్తున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్‌శాఖ డిప్యూటీ ఈఈ శ్రీకాంత్, తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి స్పందిస్తూ పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అవుసుల కుంట కట్ట మట్టిని తొలగించడంతో ఏర్పడిన గుంతలు

సింగూరు ప్రాజెక్టు ముంపు భూమిలో మట్టి తవ్వకాలు

మునిపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లారెడ్డిపేట (బుసారెడ్డిపల్లి) శివారులో సింగూరు ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో భూమిలో మట్టి తవ్వకాలను అడ్డుకోవాలని గ్రామస్థులు అధికారులను ఆశ్రయించారు. సింగూరు ప్రాజెక్టు ముంపు భూముల్లో మట్టి తవ్వకాలు చేస్తున్నారని మల్లారెడ్డిపేట మాజీ సర్పంచ్ శివజ్యోతి, ఉప సర్పంచ్ రాజు, గ్రామస్థులు సోమవారం ప్రజావాణిలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో, మంగళవారం నాడు కబ్జాకు గురవుతున్న భూములను ఆర్ఐ సుభాష్, గ్రామ పాలన అధికారి రాజులు పరిశీలించారు. మట్టిని తవ్వుతున్న జేసీబీని సీజ్ చేసి తీసుకెళ్తున్న క్రమంలో రాజకీయ నాయకులు అడ్డుకున్నారు. వారి ఒత్తిడితో సీజ్ చేసిన జేసీబీని ఎమ్మార్వో కార్యాలయానికి, పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లకుండా మల్లారెడ్డిపేట గ్రామ పంచాయతీకి తీసుకెళ్లడంపై పలు అనుమానాలకు దారి తీస్తుందని గ్రామస్థులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సింగూరు ప్రాజెక్టులో ముంపునకుగురైన భూమిని కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



సింగూరు ప్రాజెక్టు భూమిలో మట్టిని తవ్వుతున్న జేసీబీ





పట్టుకున్న మద్యం పారబోత


మద్యాన్ని పారబోస్తున్న పోలీసులు,ఎక్సైజ్ అధికారులు

పటాన్‌చెరు నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో పట్టుబడిన మద్యాన్ని శివారు ప్రాంతంలో పారబోసిన సంఘటన ఐడీఏబొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సమయంలో చేసిన తనిఖీల్లో 25 కేసుల్లో 365లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. దాన్ని కోర్టు ఆదేశాల మేరకు మంగళవారం శివారు ప్రాంతంలో పారబోసారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఏఈఎస్ మణెమ్మ, సీఐ పరమేష్ గౌడ్, తదితరులు ఉన్నారు.

యువకుడి దుర్మరణం

పటాన్‌చెరు,నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని ఓ యువకుడు దుర్మరణం పాలయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై అభిమాన్‌సింగ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా మిర్జాపూర్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్ (30) హైదరాబాద్ హిమాయత్‌నగర్ బషీర్‌బాగ్‌లో ఉంటూ కూలిపని చేసుకుంటూ జీవిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం ఇస్నాపూర్ గురుకుల పాఠశాల ఎదురుగా రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దాంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు.

తాళాలు పగలగొట్టి చోరీ

జోగిపేట రూరల్, నవంబర్11 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని దుండగులు దుకాణాల షటర్ల తాళాలు పగలగొట్టి నగదు, విలువైన మొబైల్ ఫోన్‌లను దోచుకెళ్లిన ఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేటలో చోటుచేసుకుంది. ఎస్సై పాండు తెలిపిన వివరాల మేరకు... జోగిపేటలోని భగత్‌సింగ్ రోడ్డు పరిధిలో ఉన్న చింతల రాజమల్లయ్య ఫర్టిలైజర్ దుకాణంలో మంగళవారం తెల్లవారుజామున తాళాలు పగలగొట్టిన గుర్తుతెలియని దుండగులు షాప్‌లోకి చొరబడి కౌంటర్‌లోని 15 వేల రూపాయల నగదును అపహరించారు. అంతే కాకుండా దానికి ఎదురుగా ఉన్న ఎ1 మొబైల్ షాప్‌లోని విలువైన మొబైల్ ఫోన్‌లను దోచుకెళ్లారు.
























ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రధాన రోడ్లు అడుగడుగునా ప్రమాదాలకు నెలవుగా మారాయి. కొన్నిచోట్ల గుంతల ఏర్పడి ధ్వంసం కాగా, మరికొన్ని చోట్ల కోతకు గురయ్యాయి. కనీస మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల రంగారెడ్డి జిల్లా చేవేళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతను తప్పించబోయి ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొట్టడంతో జరిగిన ఘోరప్రమాదం తెలిసిందే. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకముందే అధికారులు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


వెల్దుర్తి- మెదక్ ప్రధాన రహదారిపై గుంతలు


కాళ్లకల్ -ముప్పిరెడ్డిపల్లి రోడ్డు పరిస్థితి..

గుంతలు.. గతుకులు


వెల్దుర్తి- మెదక్ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు


నారాయణఖేడ్ : జాతీయ రహదారిపై ఏర్పడిన గతుకులు

ఉమ్మడి జిల్లాలో అధ్వానంగా పలు రోడ్లు
గుంతలమయమైన రహదారులు
కోతకు గురై గోతులు
కనీసం మరమ్మతుకు నోచుకోని వైనం
భయం భయంగా వాహనదారుల ప్రయాణం

వెల్దుర్తి-మెదక్ రోడ్డులో

వెల్దుర్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలోని వెల్దుర్తి- మెదక్ వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయమై, ప్రమాదాలకు నెలవుగా మారింది. జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డు అసలే ఇరుకుగా ఉండగా, పెద్ద గుంతలు ఏర్పడడంతో ప్రస్తుతం ప్రయాణం దుర్భరంగా మారింది. ముఖ్యంగా రామాయిపల్లి, ఏదులపల్లి, బండపోసానిపల్లి, శెట్టిపల్లికలాన్ గ్రామాల ప్రజలు నిత్యం భయం భయంతో ప్రయాణం సాగిస్తున్నారు. ఆ గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వానికి కనువిప్పు కలగడం లేదు. ఉప్పులింగాపూర్ శివారు హల్దీవాగు బ్రిడ్జి వద్ద, రామాయిపల్లి శివారు బషీర్ చెరువు అలుగు కాలువ వద్ద భారీ వర్షాలు కురిసినప్పుడు బ్రిడ్జిలపై నీళ్ల ప్రవహిస్తుండడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. దీంతో ప్రయాణికులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కాళ్లకల్-ముప్పిరెడ్డిపల్లి దారిలో..

మనోహరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలోని మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామం నుంచి ముప్పిరెడ్డిపల్లి గ్రామం వరకు ఉన్న రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి, కిలో మీటరు వరకు ధ్వంసమైంది. ఈ మార్గంలో పరిశ్రమలకు వెళ్లే కార్మికులు, స్థానికులు నిత్యం నానా అవస్థలు పడుతున్నారు. గతంలో పలుమార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా, వారు వచ్చి చూసి వెళ్లడం తప్పితే, ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతు పనులు చేపట్టలేదని గ్రామస్థులు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రామాయంపేట-సిద్దిపేట రహదారి మధ్యలో


దెబ్బతిన్న చేర్యాల- కడవేరుగు దారి


టేక్మాల్ : కలేవాగు వంతెనపై గుంత

రామాయంపేట- సిద్దిపేట మార్గంలో

రామాయంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలోని రామాయంపేట - సిద్దిపేట వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడిన అడుగు లోతు గుంత ప్రమాదకరంగా మారింది. ఈ గుంతను పూడ్చే బదులు, మున్సిపల్ సిబ్బంది హెచ్చరికగా గుంత పక్కన బండరాళ్లను పాతారు. ఇది గుంత కంటే ప్రమాదకరంగా మారిందని, రాత్రి వేళల్లో ఈ రాళ్లను ఢీకొని ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని వాహనదారులు చెబుతున్నారు.

దెబ్బతిన్న వంతెనలు

టేక్మాల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని గుండు వాగు, కలేవాగు వంతెనలు దెబ్బతిన్నాయి. టేక్మాల్ నుంచి జోగిపేట, హైదరాబాద్‌కు గుండువాగు వంతెనపై ఇనుప చువ్వలు తేలాయి. టేక్మాల్ శివారులోని కలేవాగు వంతెనపై ఉన్న తారు రోడ్డు కోతకు గురై, వంతెనపై గుంత ఏర్పడింది.

ఖేడ్-బీదర్ జాతీయ రహదారిపై

నారాయణఖేడ్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్-బీదర్ 161బీ జాతీయ రహదారి అత్యంత ప్రమాదకరంగా మారింది. ఖేడ్ శివారులోని మనూరు క్రాస్ రోడ్స్ నుంచి జగన్నాథ్‌పూర్ వెళ్లే మార్గంలో దారి పక్కన భారీ గోతి ఏర్పడింది. అలాగే, విస్తరణ పనుల కారణంగా దుమ్ము భారీగా లేస్తుండడంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు.

అధ్వానంగా హుస్నాబాద్ రోడ్లు..

హుస్నాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని ఆర్ అండ్‌బీ రహదారులు అధ్వానంగా మారాయి. నిత్యం హుస్నాబాద్-కరీంనగర్ ప్రధాన రహదారిపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. సెయింట్ జోసెఫ్ స్కూల్ ఎదురుగా కల్వర్టు తెగిపోయి, పెద్ద గుంతలు ఏర్పడటంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నాగారం రోడ్డులోని కస్తూర్బా కాలనీ శివారులో రోడ్డు కోతకు గురైంది. కరీంనగర్ రోడ్డులోని మడద రాములపల్లి వై జంక్షన్ వద్ద సూచిక బోర్డులు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి.

చేర్యాల-కడవేరుగు దారిలో

చేర్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో వరుసగా కురిసిన వర్షాల కారణంగా సిద్దిపేట జిల్లాలోని చేర్యాల-కడవేరుగు ప్రధాన రహదారి దెబ్బతింది. అడుగడుగునా గుంతలమయం, సైడుబర్మ్‌ల కోతలతో ప్రమాదకరంగా మారింది. గాంధీచౌక్, దుర్గమ్మ దేవాలయం, బాలికల జడ్పీఎస్ఎస్, ఊట్లపల్లి కాలనీకి వెళ్లే చౌరస్తాతోపాటు పలు ప్రదేశాలలో భారీగా గుంతలు ఏర్పడ్డాయి.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు


బాలమణి (ఫైల్)

చేగుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తల్లి మృతిచెందగా, కొడుకుకు తీవ్ర గాయాలైన సంఘటన నార్సింగ్ శివారులోని 44వ జాతీయ రహదారి వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంట మండలం వల్లభాపూర్ గ్రామానికి చెందిన తల్లీకొడుకు ముత్త బాలమణి (58), ముత్త రాములు వల్లభాపూర్ నుంచి ద్విచక్ర వాహనంపై రామాయంపేటలోని ఆసుపత్రికి వెళ్తున్నారు. నార్సింగి శివారులోని 44వ జాతీయ రహదారి వద్ద గుర్తు తెలియని వాహనం వారిని ఢీకొనడంతో బాలమణి కిందపడి అక్కడికక్కడే మృతిచెందింది. ఆమెపై నుంచి వాహనాలు వెళ్లడంతో మృతదేహం నుజ్జునుజ్జయింది. రాములుకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు నార్సింగ్ ఎస్ఐ సృజన కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో హనుమాన్ మాలధారుడు..


లాలాగౌడ్ (ఫైల్)

రామాయంపేట, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో హనుమాన్ మాలధారుడు మృతి చెందిన సంఘటన రామాయంపేట పట్టణంలో చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. రామాయంపేట ఉమ్మడి మండలం నస్కల్ ప్రాంతానికి చెందిన బక్కన్న గారి లాలాగౌడ్(53) రామాయంపేటలో స్థిరపడ్డాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ఆయన సరిగా నడవకపోవడంతో ఇటీవల స్థానికంగా హోటల్ నడుపుతున్నాడు. ఈ క్రమంలో ఆయన మంగళవారం ఉదయం హోటల్‌ను శుభ్రం చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయారు. అతనితోపాటు ఉన్న మరో మాలధారుడు వినయ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించగా లాలాగౌడ్ అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. సీఐ బాలరాజు, సీఐ వెంకట రాజాగౌడ్, ఎస్సై బాల్‌రాజు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ బెట్టింగ్‌లో నష్టాలు..

● యువకుడి ఆత్మహత్య


అఖిల్ (ఫైల్)

రామచంద్రాపురం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌లో నష్టాలు రావడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ జగన్నాథ్ తెలిపిన వివరాల ప్రకారం... కడపకు చెందిన సంగీతరావు 30 ఏళ్ల క్రితం రామచంద్రాపురం సాయినగర్‌లో స్థిరపడి, ఇంజనీరింగ్ వర్క్‌షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయన కుమారుడు అఖిల్(30) చదువు పూర్తయిన తర్వాత వర్క్‌షాపును చూసుకునేవాడు. అయితే, అఖిల్ క్రికెట్ బెట్టింగ్‌కు బానిసై సుమారు రూ.6 లక్షల వరకు పోగొట్టుకున్నాడు. దీనికోసం అప్పులు కూడా చేశాడు. అప్పులు పెరగడం, బెట్టింగ్‌లో డబ్బులు పోతుండడంతో మనస్తాపానికి గురై బీరంగూడ కమాన్ పక్కనే ఉన్న ఓ లాడ్జిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి మృతదేహం లభ్యం


వడ్డె నాగవ్వ (ఫైల్)

కల్హేర్/సిర్గాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టులో మంగళవారం వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. సిర్గాపూర్ ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం... ప్రాజెక్టులోని గంగమ్మ దేవాలయం సమీపంలో నీటిలో తేలిన మహిళ మృతదేహాన్ని మత్స్యకారులు, స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి సిర్గాపూర్ మండలం బొక్కస్‌గామ్ గ్రామానికి చెందిన ఒడ్డె నాగవ్వ(70)గా గుర్తించారు. మతిస్థిమితం సరిగా లేని నాగవ్వ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుందా, లేక స్నానం చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి మరణించిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలు నాగవ్వ సోదరుడు పాపయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

'ఆపదలో అంబులెన్స్'పై ఇంటెలిజెన్స్ ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నారాయణఖేడ్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'ఆపదలో అంబులెన్స్' శీర్షికతో ఆంధ్రజ్యోతి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనంపై ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీశారు. నారాయణఖేడ్ ఏరియా వైద్యశాల ఆవరణలో నిలిచిపోయిన అంబులెన్స్ వాహనం, ఖేడ్ వైద్యశాలకు సంబంధించి మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి ఇచ్చిన ఓమ్ని అంబులెన్స్ ఎక్కడ ఉంది అనే విషయాలతో పాటు 108 వాహనాల పరిస్థితిపై కూడా ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. ఈ సమాచారాన్ని ప్రభుత్వానికి నివేదించినట్లు సమాచారం.

నేడు 'యోగా' ఎంపికలు

సిద్దిపేట రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నారాయణరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉమ్మడి జిల్లా స్థాయి యోగా ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సౌందర్య తెలిపారు. జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ సెలక్షన్‌లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల పాఠశాలల్లోని విద్యార్థులకు అండర్-14, 17 కేటగిరిలో సెలక్షన్‌లు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల బాలబాలికలు ఆధార్ కార్డు, ఒరిజినల్ బోనఫైడ్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు పీడీ సతీష్ 9948110433, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సౌందర్య 9949494748లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు

మూడు ఇళ్లల్లో చోరీ

● రూ.1.20 లక్షలు, నగలు అపహరణ

పుల్కల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తానాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. మూడు ఇళ్ల, ఒక అంగన్‌వాడీ కేంద్రం తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. పుల్కల్ ఎస్ఐ ఎన్. విశ్వజన్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మన్నె బాల్‌రాజ్, చంటి కిష్టమ్మ, మన్నె కమలమ్మ ఇళ్లతో పాటు అంగన్‌వాడీ కేంద్రంలో దొంగలు చొరబడ్డారు. మన్నె బాల్‌రాజ్ ఇంట్లో రూ.లక్ష నగదు, రెండు బంగారు రింగులు, చంటి కిష్టమ్మ ఇంట్లో రూ.20 వేల నగదు, ఐదు తులాల వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. అయితే, మన్నె కమలమ్మ ఇల్లు, అంగన్‌వాడీ కేంద్రం తాళాలు పగులగొట్టి చొరబడినప్పటికీ, ఎలాంటి వస్తువులూ అపహరించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటన స్థలాన్ని జోగిపేట సీఐ అనిల్‌కుమార్ సందర్శించారు.


రవళిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ సునీత

జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు రవళి

సిద్దిపేట కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ పచ్చిమట్ల రవళి ఎంపికైంది. తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్, రంగారెడ్డి జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబరు 1, 2 తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలలో రవళి 3వ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనడానికి అర్హత సాధించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జి.సునీత రవళిని అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్ టేకర్ బి. కృష్ణయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. పి. అయోధ్య రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా. గోపాల సుదర్శనం, కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. సీహెచ్ మధుసూదన్, ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ జి.బాలకిషన్, కోచ్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలలో కుళ్లిన గుడ్లు

హత్నూర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండలం ముచ్చర్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం గర్భిణులకు కుళ్లిపోయిన గుడ్లు వచ్చాయి. గతంలో మధుర అంగన్‌వాడీ కేంద్రంలో కూడా పిల్లలకు సరఫరా చేసే సమయంలో కుళ్లిన గుడ్లు వచ్చిన విషయం తెలిసిందే. ఇలా తరుచూ నాసిరకం సరుకుల సరఫరాతో చిన్నారుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతుండడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ల పర్యవేక్షణ కొరవడడం తోనే ఇలా ఘటనలు చేసుకుంటున్నాయనే ఆరోపణలున్నాయి. ఈ విషయమై జోగిపేట సీడీపీవో ప్రియాంకను వివరణ కోరగా కుళ్లిన గుడ్లు, నాసిరకం సరుకుల పంపిణీపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదివరకే ఇలాంటి ఫిర్యాదులు వస్తే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి కాంట్రాక్టర్లను మార్పించామని పేర్కొన్నారు.


ముచ్చర్ల అంగన్‌వాడీ సెంటర్‌లో కుళ్లిన గుడ్లు



అందెశ్రీకి నివాళి

ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ స్మారకార్థం, నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్ గుండు శివకుమార్ రావి ఆకుపై ఆయన చిత్రాన్ని వేసి నివాళులర్పించారు.

- నారాయణఖేడ్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):

కుక్కల వేట

(5వ పేజీ తరువాయి)

ముందుకు వేయలేదు. అక్కడక్కడ మాత్రం కొన్ని కుక్కలకు శస్త్రచికిత్స చేసినా నిధుల లోపంతో వెనక్కుతగ్గారు. ఓవైపు కుక్కలు స్వైరవిహారం చేస్తూ అమాయకులను గాయపరుస్తుంటే వాటిని అరికట్టడానికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. కుక్కల సంఖ్యను లెక్కించి కాగితాలకే పరిమితం చేశారు. కానీ, వాటికి జనన నియంత్రణ ఆపరేషన్లు చేయించలేకపోయారు. ఒక కుక్కకు ఆపరేషన్ చేయించాలంటే రూ.1,500 ఖర్చవుతుంది. గ్రామపంచాయతీల్లో డబ్బులు లేకపోవడంతో చాలా గ్రామాల్లో వెనక్కుతగ్గారు. నిరంతరం ఆదాయం వచ్చే మున్సిపాలిటీలు సైతం నిర్లక్ష్యం చూపాయి. దీంతో పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా కుక్కలు విజృంభిస్తున్నాయి.

న్యూస్ బాక్స్

డీసీసీబీ బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పెద్దశంకరంపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : డీసీసీబీ బ్యాంక్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ ఖలీమొద్దీన్ అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేట మండల పరిధిలోని గొట్టిముక్కల గ్రామంలో డిపాజిట్ల సేకరణ మహోత్సవంలో భాగంగా ఆయన మాట్లాడారు. రైతులకు మహిళలకు బ్యాంకు అందిస్తున్న సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు రవీందర్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

పుల్‌కల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండలంలోని 31 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.12,37,500 లక్షల చెక్కులను ఎంపీపీ మాజీ అధ్యక్షుడు భూంరెడ్డి సుభాష్‌రెడ్డి, జోగిపేట డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డితో కలిసి పంపిణీ చేశారు.

ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా మహేందర్‌రెడ్డి

తూప్రాన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా తూప్రాన్ పట్టణ పరిధి బ్రాహ్మణపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు (పిజికల్ సైన్స్-ఎస్‌ఏ) పి.మహేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. కాచిగూడ ఎస్టీయూ కార్యాలయంలో 79వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో మహేందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కౌన్సిల్ సభ్యులకు, జిల్లా ప్రతినిధులకు, ఎస్టీయూ సీనియర్ నాయకులకు మహేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ శాఖ ఏఈగా చంద్రశేఖర్

పెద్దశంకరంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట మండల విద్యుత్ శాఖ ఏఈగా చంద్రశేఖర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పాపన్నపేట మండలంలో ఏఈగా పనిచేస్తూ బదిలీపై పెద్దశంకరంపేట మండలానికి వచ్చారు. విద్యుత్‌శాఖలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

నష్టపోయిన పంటల పరిశీలన

చేగుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చేగుంట మండలం రుక్మాపూర్‌లో 40 మంది రైతులు పాతూరు వరి రకం పంట వేసి నష్టపోయిన విషయం తెలిసిందే. కాగా జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్ ఆదేశాల మేరకు తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పంట పొలాలను పరిశీలించి, వివరాలు సేకరించారు. సంబంధిత నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తున్నట్లు వారు తెలిపారు.

అర్థమయ్యే విధంగా విద్యాబోధన చేయాలి

చిన్నశంకరంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు అర్థమయ్యేవిధంగా విద్యాబోధన చేయాలని ఎంఈవో పుష్పవేణి ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లి గ్రామాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

18వ సారి అయ్యప్ప దీక్షధారణ

సంగారెడ్డి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్పస్వామి దీక్షను 18వ సారి బాటప్ల మల్లేశం గురుస్వామి స్వీకరించారు. మంగళవారం సంగారెడ్డి మండలం తాళ్లపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో రాధాకృష్ణ గురుస్వామిచే కేరళీయ తంత్ర విధానంలో అయ్యప్ప మహాపడి పూజ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వాములు భజన సంకీర్తలతో భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.

బీసీ జేఏసీ ధర్మ దీక్ష

సంగారెడ్డి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో ధర్మ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ చైర్మన్ ప్రభుగౌడ్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేంత వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

నాగల్‌గిద్ద, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందింది. నాగల్‌గిద్ద మండలం శాపూర్ గ్రామానికి చెందిన మేస్త్రీ బసప్ప తన వ్యవసాయ పొలంలో ఎద్దును మేపుతుండగా సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు విలువ రూ.లక్ష ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

విద్యాభివృద్ధికి అబుల్ కలామ్ ఆజాద్ కృషి

● అదనపు కలెక్టర్ మాధురి

సంగారెడ్డి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అబుల్ కలామ్ ఆజాద్ భారత స్వాతంత్ర్య ఉద్యమంలోనే కాదు విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారని సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు మహా విద్యావేత్త అబుల్ కలాం ఆజాద్ జయంతిని దేశవాప్తంగా ప్రతియేటా నవంబరు 11న జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి విశాలాక్షి, డీఆర్‌వో పద్మజారాణి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి



అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మెదక్ అదనపు కలెక్టర్ నగేష్

విద్యా వ్యవస్థను తీర్చిదిద్దిన వ్యక్తి ఆజాద్

మెదక్ అర్బన్, నవంబరు11(ఆంధ్రజ్యోతి) : దేశ విద్యావ్యవస్థను తీర్చిదిద్దిన గొప్ప పరిపాలనాదక్షుడు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ అని మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అబుల్ కలామ్ ఆజాద్ 137 జయంతిని జిల్లా మైనార్టీశాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అదనపు కలెక్టర్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో భుజంగరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, ఇన్‌చార్జి జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి విజయలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

●సంగారెడ్డి అర్బన్: విద్యే సమాజ అభివృద్ధికి మూలమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. సంగారెడ్డిలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధన్‌రాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●నారాయణఖేడ్ : ఖేడ్ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో మంగళవారం అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని పురస్కరించుకొని స్థానిక ముస్లిం యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ విద్యాదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

70,100 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

మెదక్ కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాల్లో ఇప్పటివరకు 70 వేల 100 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. మెదక్ మండలం పరిధిలోని పాతూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించి, రిజిస్టర్లను పరిశీలించారు. కొనుగోలు వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్థులు, కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

●తూప్రాన్ : ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బుల జమచేసేలా చర్యలు తీసుకోవాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తూప్రాన్ పట్టణంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రం సందర్శించారు.



తూప్రాన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రంలో మాయిశ్చర్ పరిశీలిస్తున్న ఆర్డీవో

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

●చేగుంట :మండలంలోని బోనాల, అనంతసాగర్ గ్రామాల్లో ఉన్న భారతి, శివసాయి రైస్‌మిల్లులను తహసీల్దార్ శివప్రసాద్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జయభారత్‌రెడ్డి, సర్వే రవీందర్‌రెడ్డి, మిల్లు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి : డీఈవో

సంగారెడ్డి అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు. సంగారెడ్డిలోని అంబేడ్కర్ మైదానంలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-14, 17 బాలుర జిల్లాస్థాయి ఖోఖో టోర్నమెంట్ మంగళవారం నిర్వహించారు. డీఈవో వెంకటేశ్వర్లు హాజరై క్రీడా జ్యోతి వెలిగించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్జీఎఫ్ సెక్రటరీ శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రీడా జ్యోతి వెలిగిస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

ప్రభుత్వ పాఠశాలలో కండోమ్స్ ప్యాకెట్ల కలకలం

● మెదక్ జిల్లా కాట్రియాలలో ఘటన

రామాయంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిధి కాట్రియాల ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం కండోమ్స్ కలకలం సృష్టించాయి. గుర్తుతెలియని వ్యక్తులు అక్కడ ప్యాకెట్లను పడేయడం ప్రశ్నార్థకంగా మారింది. అంతేగాక మరికొన్ని లూస్‌గా ఉండటంతో వాడి పడేశారా..? లేక కొత్తవా.. అన్న ప్రశ్నలు తలెత్తాయి. చిన్న పిల్లలు చదువుకునే పాఠశాలలో కండోమ్స్ ప్యాకెట్లు లభ్యమవటం ఆందోళన కలిగించింది. ఈ విషయమై ఎంఈవో శ్రీనివాసులు వివరణ కోరగా.. గడువు ముగిసిన కండోమ్స్ పాఠశాల ఆవరణలో ఉన్నట్లు గుర్తించామన్నారు. ఉదయం పాఠశాల దగ్గరలో కుప్పగా పోసి కాల్చివేసినట్లు తెలిపారు.



కాట్రియాల స్కూల్ ఆవరణలో పడేసిన కండోమ్స్

తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

తూప్రాన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు మార్ఫింగ్, ఏఐ ఫొటోలతో సోషల్ మీడియాలో ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అటవీశాఖ తూప్రాన్ సెక్షన్ అధికారి ఓంప్రకాశ్ హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం తూప్రాన్ మండలం మల్కాపూర్, గుండ్రెడ్డిపలి, దాతర్‌పల్లి గ్రామాల్లో బీట్ ఆఫీసర్ చిరంజీవితో కలిసి చిరుతపులి సంచారంపై అవగాహన కల్పించారు. గుండ్రెడ్డిపల్లి అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తుందని, గ్రామస్థులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. దాతర్‌పల్లి అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు మార్ఫింగ్, ఏఐ ఫొటోలు సోషల్ మీడియాలో ప్రచారం చేయడంపై ఆగ్రహించారు.

సభ్యత్వ నమోదుకు ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్

● టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్

మెదక్ అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల సభ్యత్వ నమోదు కోసం ఆన్‌లైన్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సంఘ భవన్‌లో తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల జిల్లా ఫోరం సభ్యత్వ నమోదు కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఆన్‌లైన్ పోర్టల్‌ను ఆయన ప్రారంభించారు. తొలి సభ్యత్వాన్ని జిల్లా ఫోరం కార్యదర్శి సంతోష్ నమోదు చేసుకున్నారు. జిల్లావ్యాప్తంగా సభ్యత్వ నమోదు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఫజులుద్దీన్, సభ్యులు ప్రవీణ్, ప్రభాకర్ రెడ్డి, జగదీష్, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభిస్తున్న నరేందర్

క్షతగాత్రుడికి ఎంపీ పరామర్శ



ప్రతాప్‌ను పరామర్శిస్తున్న ఎంపీ సురేష్‌షెట్కార్

నారాయణఖేడ్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వారంరోజుల క్రితం కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతిచెందగా.. ఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్‌కు చెందిన బిరాదర్ ప్రతాప్ తీవ్రంగా గాయపడి హైదరాబాద్ పంజాగుట్టలోని నిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. కాగా మంగళవారం ఎంపీ సురేష్‌షెట్కార్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ వేర్వేరుగా ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయనతో పాటు కుటుంబీకులకు మనోస్థైర్యాన్ని కల్పించారు. ఆరోగ్య పరిస్థితిని గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

రహదారులను బాగు చేయించాలి

జిన్నారం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గడ్డపోతారం మున్సిపాలిటీ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా మారాయని, సీఎస్ఆర్ నిధులు వెచ్చించి బాగు చేయించాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. మంగళవారం గడ్డపోతారం మున్సిపాలిటీలో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అభివృద్ధి, సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఓటరు జాబితాలో మ్యాపింగ్ గురించి ఆరాతీశారు. సిటిజన్ సర్వీస్ లాగిన్ల పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, ఆర్‌వో మధుసూదన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ కేసులో చార్జిషీట్ నమోదు చేయాలి

● తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్

చిన్నశంకరంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ కేసులో చార్జిషీట్ నమోదు చేయాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేట పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్ కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల్లో విచారణ చేసేటప్పుడు ఏవిధంగా చేయాలి. ఏఏ అంశాలు క్రోడీకరించాలనే విషయాలను వివరించారు. అనంతరం కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, సిబ్బందికి శాంతిభద్రతలపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటరాజాగౌడ్, ఎస్ఐ నారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

చిన్నశంకరంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని వరిగొంతం పీఠాధిపతి మాధవానంద సరస్వతి అన్నారు. చిన్నశంకరంపేట మండలంలోని మిర్జాపల్లిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోతరాజు రమణ ఆధ్వర్యంలో శివ పంచాయత హనుమాన్ ఆలయ వార్షికోత్సవాలు నిర్వహించారు. మంగళవారం అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, మాజీ ఎంపీపీ అరుణప్రభాకర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

'ఆశా'లను మోసగించిన ప్రభుత్వం

సంగారెడ్డి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో రూ.18 వేల ఫిక్స్ వేతనం ఇస్తామని ఆశాలకు ఆశచూపి కాంగ్రెస్ ప్రభుత్వం మోసగించిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ.సాయిలు విమర్శించారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో మంగళవారం నిర్వహించిన ఆశాల జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశావర్కర్లు 20 ఏళ్లుగా అనేకరకాల సేవలందిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడుతున్న వారికి మాత్రం నేటికీ కనీస వేతనం అమలు చేయడం లేదన్నారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాయిలు

కూలీల ఆధార్ ఈకేవైసీ తప్పనిసరి

హత్నూర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కూలీల ఈకేవైసీ తప్పనిసరిగా చేయాలని ఎంపీడీవో శంకర్ ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. గ్రామాల్లో వన మహోత్సవంలో నాటిన మొక్కల పర్యవేక్షణ, సంరక్షణ ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ప్రవీణ్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌కు ఓటర్ల తరలింపు

● పోటీపడి వాహనాల ఏర్పాటు
● ఓటుకు రూ.3 వేల నుంచి రూ.3,500 ఇచ్చినట్టు సమాచారం

రామచంద్రాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గ ఉపఎన్నికకు కొల్లూరు 2బీ హెచ్‌కెలోని ఓటర్లను ఓటువేసేందుకు పలు పార్టీ నాయకులు పోటీపడి తరలించారు. ఆటో నుంచి బస్సు వరకు వివిధ వాహనాలను ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం వాహనాలు కొల్లూరు 2బీ హెచ్‌కె వద్దకు చేరుకున్నాయి. ఆయా వాహనాల్లోకి ఎక్కిన ఓటర్ల వద్ద ఉన్న ఓటరు స్లిప్‌ను చూసి డబ్బులు ఇచ్చినట్టు సమాచారం. ఓటుకు రూ.3 వేల నుంచి రూ. 3,500 వేల వరకు ఇచ్చినట్టు తెలిసింది.



ఓటర్లను తరలించడానికి సిద్ధంగా ఉంచిన బస్సులు

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం ఖాయం : నర్సారెడ్డి

మనోహరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలవడం ఖాయమని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్ నాయకులు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. నవీన్‌యాదవ్ 50 వేల మెజారిటీతో గెలవబోతున్నారని నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ఇందులో మనోహరాబాద్ మండలం వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, నాగేందర్‌రెడ్డి, లక్ష్మీనరసింహగౌడ్, కృష్ణ పాల్గొన్నారు.

కాలనీల్లో సీసీ రోడ్లకు నిధులు



మయూరినగర్‌లో పర్యటించిన కార్పొరేటర్ పుష్పానగేష్

రామచంద్రాపురం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మించడానికి ప్రత్యేకంగా నిధులు మంజూరవుతున్నాయని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. మంగళవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి మయూరినగర్‌లో పర్యటించి మాట్లాడారు. గతంలో కాలనీలో బస్తీ దర్శన్ కార్యక్రమం నిర్వహించినప్పుడు సీసీ రోడ్లు కావాలంటూ కాలనీవాసుల వినతిమేరకు అధికారులు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారని తెలిపారు. అలాగే పార్కు సుందరీకరణ పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈ కృష్ణవేణి, ఏఈ దివ్య, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాధవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం



ఏపీఆర్ కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కుమార్‌యాదవ్

పటాన్‌చెరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో పరిశుభ్రత పాటించడానికి ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధి ఏపీఆర్ కాలనీలో పర్యటించారు. స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. శుభ్రత లేకపోవడంతో సిబ్బందికి ప్రత్యక్షంగా చూపించారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్‌చారి, ప్రధాన కార్యదర్శి రాకేష్ అల్లం, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివ అన్నపూజ, పూర్ణాహుతి

కంది, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలో రుక్మిణీ పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఆలయ ధర్మకర్తలు దీపక్ దేశ్‌మఖ్, సునీల్ దేశ్‌మఖ్ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య బలిహరన హోమం, శివ అన్నపూజ, పూర్ణాహుతి, రథోత్సవం, లంకాదహనం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ రావుపంతులు, సురేష్‌పంతులు, విజయ్‌పంతులు, నవీన్‌పంతులు, శ్రీను పంతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయాల వార్షికోత్సవాలు



స్వామివారిని ఊరేగిస్తున్న మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి

పటాన్‌చెరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఐడీఏబొల్లారం పట్టణంలో వారంరోజులుగా జరుగుతున్న సాయిబాబా, భవానీ శంకర ఆలయాల వార్షికోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. చివరిరోజు హోమం చేశారు. నవగ్రహ, సుదర్శన, దుర్గా, జయాధి, సాయినాధుని మూలమంత్ర వంటి హోమాల అనంతరం స్వామివారిని ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రోజా, మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యుడు నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ కోసమే 'ప్రజాబాట'

తూప్రాన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించేందుకు ప్రజాబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తూప్రాన్ విద్యుత్ డీఈ గరత్మంత్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం తూప్రాన్‌లో నిర్వహిస్తున్న ప్రజాబాటను ఏడీవో శ్రీనివాస్, ఏఈ వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. ప్రజాబాటలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శుభ్రం చేయడం, సర్వీసులను మెరుగుపరచడం చేపడుతున్నట్లు వివరించారు.

ఫుట్‌పాత్ వ్యాపారాలపై కొరడా



ఫుట్‌పాత్‌పై దుకాణాలను తొలగిస్తున్న పోలీసులు

తూప్రాన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణంలో రోడ్లపై అడ్డదిడ్డంగా ఏర్పాటు చేస్తున్న ఫుట్‌పాత్ వ్యాపారులపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు. మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి, ఎస్ఐ శివానందం ఆధ్వర్యంలో మంగళవారం దాడులు చేశారు. రోడ్లపై ఏర్పాటు చేసిన దుకాణాల కారణంగా వాహనాల రవాణాకు ఇబ్బందిగా మారిందని వివరించారు. రోడ్లపై ఏర్పాటు చేసిన పలు దుకాణాల బండ్లను తొలగించి మున్సిపల్ కార్యాలయానికి తరలించారు.

మనోహరాబాద్‌లో స్వర్ణామృత ప్రాసన

మనోహరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మనోహరాబాద్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ భవనంలో శ్రీ సరస్వతీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో స్వర్ణామృత ప్రాసన చుక్కల మందు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రతీనెల పుష్యమి నక్షత్రం రోజున ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. 0-16 ఏళ్ల మధ్య ఉన్న చిన్నారులందరూ వేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ గౌడ్, జిల్లా సహ కార్యవాహ ఏపూరి రాజు, ఐలయ్య పాల్గొన్నారు.

పాఠశాలలో మధ్యాహ్న భోజనం ప్రారంభం

కల్హేర్/సిర్గాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఖాజాపూర్ పాఠశాలలో నిలిచిపోయిన మధ్యాహ్న భోజన పథకం సిర్గాపూర్ మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్ చొరవతో తిరిగి మంగళవారం ప్రారంభమైంది. స్థానిక ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం బిల్లులు రావడం లేదంటూ వంట చేసే కార్మికులు సోమవారం భోజనం తయారు చేయలేదు. దీంతో విద్యార్థులు గృహాలకు వెళ్లి భోజనం చేసినట్లు స్థానికులు తెలిపారు. విషయాన్ని హెచ్ఎం మారుతి ఎంఈవో దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం ఎంఈవో శ్రీనివాస్ పాఠశాలకు వెళ్లి మధ్యాహ్న భోజన కార్మికులతో మాట్లాడారు. తమకు నెలనెలా బిల్లులు వస్తేనే వంట చేస్తామని వారు తెలిపారు. వెంటనే వేరే మహిళలను కార్మికులుగా నియమించి భోజనం ప్రారంభించేలా ఎంఈవో చర్యలు చేపట్టారు.

రోడ్డు పక్కనే చెత్త..!

ఝరాసంగం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చీల మామిడి గ్రామంలో రోడ్డు పక్కన చెత్త పారబోయడంతో తీవ్ర దుర్వాసన వస్తోందని ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. చెత్త మూలంగా ఈగలు, దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నదని, అధికారులు స్పందించి తొలగించాలని కోరుతున్నారు.